# రైతు కళ్లల్లో ఆనందం చూడాలి

## ఇన్‌పుట్ సబ్సిడీలతో అది రాదు: ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, మే 18: జూన్ మొదటి వారంలో నారుమళ్ళకు నీరందించేందుకు కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఈ ఏడు ఎట్టి పరిస్థితులలోనూ తుఫానుల కంటే ముందే పంట చేతికి వచ్చేలా కార్య ప్రణాళిక ముందుకు జరుపుకోవాలని జలవనరుల శాఖకు నిర్దేశించారు. ఇస్రో సహకారంతో ఎప్పుడు, ఎక్కడ వర్షాలు పడాతాయో ముందస్తు సమాచారం తెలుసుకునే వ్యవస్థ అందుబాటులో ఉందని గుర్తుచేస్తూ, ఇస్రో అందించే సమాచారం ఆధారంగా వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉండాలని సూచించారు. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి తన కార్యాలయంలో జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో కలిసి సాగునీటి అంశాలపై సమీక్షించారు.

అందుబాటులో వున్న సాంకేతిక వనరుల సహకారంతో వారం వారం మండలాల వారీగా ఎంత నీరు అందుబాటులో వున్నదీ, ఇంకా ఎంత నీరు అవసరం అవుతుందీ పక్కా సమాచారం సేకరించి దానికి తగ్గట్టుగా తదుపరి చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. కరవు ఛాయలు కనిపిస్తే సత్వర ఉపశమన చర్యలు చేపట్టాలని చెప్పారు. ఉన్న నీటిని సక్రమంగా వినియోగించుకుంటే వ్యవసాయంలో 25% వృద్ది ప్రతి ఏటా సాధ్యం అవుతుందన్నారు. ఏ ఊళ్లో పడిన వర్షపునీరు ఆ ఊళ్లోనే భూగర్భ జలంగా మారాలనేది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎక్కడా కూడా ఎకరా పంట కూడా ఎండకుండా చూడాలని చెప్పారు.

ఇకపై సముద్రంలోకి నీరు వృధాగా పోవాడానికి వీల్లేదని, అలా వృధాగా పోయే నీటిని రిజర్వాయర్లకు కానీ, చెరువులకు కానీ మళ్లించాలని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. రాష్ట్రంలో వున్న అన్ని రిజర్వాయర్లు, చెక్ డ్యాములు, చెరువులు, పంట కుంటలు, బోర్ వెల్స్, ఇతర జలాశయాలన్నింటినీ జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఆయా వనరుల్లో వున్న నీటి నిల్వలను

అంచనా వేసి సేద్యపు అవసరాలకు సమర్ధంగా వినియోగించాలన్నారు. 3, 5, 7 కిలోమీటర్ల మేర సాగునీటి అవసరాల కోసం రూపొందించిన మొబైల్ డ్రిప్ ఇరిగేషన్‌ను ఈనెల 30 నుంచి ప్రయోగాత్మకంగా ప్రదర్శించాలని సూచించారు. తీవ్ర నీటి ఎద్దడి వుండే ప్రాంతాలలో శాశ్వతంగా పైపులైన్ల ద్వారా మొబైల్ లిఫ్టు ఇరిగేషన్ సేవలందించాలని చెప్పారు. ఇన్ పుట్స్ సబ్సిడీ అందుకోవడం ద్వారా రైతులు సంతోషపడిపోతారనుకోవడం సరికాదని, అది అతనికి ఏమాత్రం ఆనందం ఇవ్వదని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. పంట చేతికి వస్తే రైతు పొందే ఆనందాన్ని తాను చూడదలచుకున్నానని చెప్పారు. అందుకు ఎంత కష్టమైనా, వ్యయమైనా భరించడానికి తాను సిద్ధంగా వున్నానని అన్నారు. మొబైల్ లిఫ్టు ఇరిగేషన్ ద్వారా ఈ ఏడాది కనీసం 50 టీఎంసీల నీటిని అవసరమైన చెరువులకు మళ్లించాలని లక్ష్యంగా నిర్ధేశిస్తున్నట్టు చెప్పారు.